# సుబ్బారావు కారు

సుబ్బారావుకు ఓ రోజు ఓ ఆలోచన వచ్చింది. అంటే రోజుకు ఒక ఆలోచనే అతనికి వస్తుందని కాదు. ఆ రోజు ఓ ప్రత్యేకమైన ఆలోచన మామూలు ఆలోచనలకు భిన్నంగా వచ్చింది.

" తను ఎందుకు కారు కొనకూడదు?"

కారు ఒకప్పుడు గగన కుసుమం ! కేవలం ధనవంతులకే అందేది! కాని నేడు మధ్యతరగతి మానవుడు కూడ కొనుక్కుంటున్నాడు - కారణం - సులభవాయిదాలు - వడ్డీరేట్లల్లో తరుగుదల.

ఈనాడు అవసరం లేని వెధవ కూడ కారు కొనుక్కుని కారం కారం చూపులు విసురుతున్నాడు. రెండు ఆదాయాలున్నవాడు వెనకాముందు ఆలోచించకుండా ఓ కారు కొని పారేస్తున్నాడు...

ఇంకా కొందరు కారులోనే పిల్లకాయలను స్కూళ్ళల్లో దింపడం - ఆ తరువాత కారును తమ ఆఫీసుకు తెచ్చుకొని - సాయంత్రం దాకా దాన్ని పార్కు చేయడం తిరిగి ఇంటికి తీసుకురావడం లాంటివి చేస్తూవున్నారు.

అస్సలు తన కేంతక్కువైందని కారు కొనకుండా వుండాలి ! తనకు కారు లేదని అవతలి వెధవ ఎందుకు కారు కూతలు కుయ్యాలి!

లేడికి లేచిందే పరుగుచందాన - వెంటనే కారు కొనే ఆలోచన అమలు పెట్టదల్చుకున్నాడు.

తన మిత్రుల దగ్గర కారుల రకాలు - వాటి ఖరీదులు విచారించడం మోదలెట్టాడు. సుబ్బారావు కదన కుతూహలంతో వాటి వివరాలు అడుగుతూ వుంటే - అతని మిత్రులు నోరెత్తకుండా వినడమే కాకుండా గుడ్లప్పగించి చూశారు.

" ఏమిటి ! మన సుబ్బారావే కారు కొనడం !"

" అమ్మో ! ఎంగిలి చేత్తో కాకిని తోలంగా ఎవరూ చూడలేదు."

" పిలిచి పట్టెడు భిక్షం ఎవరికీ పెట్టగా ఎవరూ చూడలేదు. అటువంటిది

కారు కొంటాడా ! బేకారువెధవ!"

"కనీసం కడుపుకు కూడ తిండి తినడు – మరి దానికేం పోయిస్తాడు? నీళ్ళతో నడుస్తుందనుకున్నాడా ! పిచ్చి సన్నాసి."

"అయినా ఈ వయసులో కారేమిటి ! ఏదో బైకుందిగా దాని మీద ఏడవచ్చుగా అతని పిచ్చి గాక పోతే !" కొందరు గుసగుసలాడుకున్నారు."

"కారుంటే ఎండకు వానకు తడవకుండా – ఎండకుండా – ఇంచగ్గా తాము పోవల్సిన చోటుకు పోవచ్చు.

"ఈ ఆటోల కోసం – రిక్షాల కోసం ఎదురు చూడక్కరలేదు, వారితో బేరసారాలు చేయాల్సిన పని ఉండదు." సుబ్బారావు స్వగతించాడు.

సుబ్బారావుకు డబ్బారావు అనే స్నేహితుడున్నాడు. అతని అస్సలు పేరు డి.అప్పారావు ! అంటే డప్పారావు – అది కాస్త ప్రజల నోట్లో పడి అక్షరాలు తారుమారై డబ్బారావు అనే పేరు స్థిరపడి పోయింది. అతని సలహా కూడ తీసుకుందామని తను ఎంక్వయిరీ చేసిన 'మేకులు' – 'ధరలు' వివరించి చెప్పాడు.. డబ్బారావు తన సలహాను వివరించాడు.

"ఒట్టి తిక్కవాడిలాగా ఉన్నావు? తెలివిగల వాడెవడూ కొత్త కారు కొనడు – అందులో మొదటి సారి. నీకు డ్రైవింగు వచ్చా ? కనీసం మా చెల్లెమ్మాకు వచ్చా? మరి – కొత్తకారు యాక్సిడెంటు అయితేనో?"

"శుభమాని కారు కొంటానంటే యాక్సిడెంటు అంటాడు వీడెవడండి బాబూ!" విసుక్కున్నాడు సుబ్బారావు.

"మిత్రమా ! కాబోయే రుబ్బురోలు పత్రమా ! నీకు పాత కారే మేలు అని ఎందుకన్నానంటే ... కొత్తకారు మూడు లక్షల పైచిలుకు అనుకుందాం – పాత కారు నాకు తెల్సి – ఓ ముప్పై నలభై మధ్య వస్తుంది. ఎంచగ్గా నీకు కారు ఉంటుంది – నీ బ్యాంకు బాలెన్సు అలానే ఉంటుంది." డి. అప్పారావు ఉరఫ్ డప్పారావు ఉరఫ్ డబ్బారావు ఉవాచ.

"ఎందుకు పని కొస్తుంది? పిల్లకాయలు రైలు ఆట – కారు ఆడుకున్నట్లు

– దాన్ని మనం తోసుకుంటూ ఆఫీసుకు తీసుకుపోయి – ఓ చెట్టు క్రింద పెట్టి – ఆఫీసు అయిపోగానే మళ్ళీ తోసుకుంటూ ఇంటికి తీసుకురావడానికా?" సుబ్బారావు వ్యంగ్యంగా అన్నాడు.

" అదే నాకు మండేది – మనకు తెలియదు – ఇంకోళ్ళు చెబితే వినేది లేదు – వెనకటికి ఒకతను చెప్పాడు మా వాడికి అన్నీ మంచి బుద్ధులే వున్నాయి – రెండే రెండు చెడ్డ బుద్ధులు తప్ప అని"

" ఏంటోయ్ ఆ బుద్ధులు !"

" ఒకటి తనకు తెలియదు – రెండు ఎవడు చెప్పినా వినే అలవాటు లేదు – మిగతా విషయాల్లో బంగారం." వెక్కిరించాడు.

" కొత్తకారు కొంటే యాక్సిడెంటు అవుతుందంటావు – మరి ఇన్సూరెన్సు ఉంటుందిగా!" ధర్మసందేహం వ్యక్తం చేశాడు సుబ్బారావు.

" ఆ వుంటుంది. నువ్వు పోతే నిన్ను నమ్ముకున్న వాళ్ళు బాగా సుఖపడతారు." హి హి హి అని ఇకిలిస్తూ చెప్పాడు డబ్బారావు.

" సరే ! సెకండ్ హ్యాండ్ కారుకు యాక్సిడెంటు కాదా?!"

" ఎందుకవుతుంది – దానికి రోడ్డుమీద అనుభవం ఉంది కాబట్టి ఒళ్ళు దగ్గర పెట్టుకుని నడుస్తుంది మరి."

" నిజమే కాని – సంఘంలో మన పరపతి తిరపతికి పోదా ? మనమేంటి మన స్టేటస్ ఏంటి?" ఆలోచనలో పడ్డాడు సుబ్బారావు.

" నీదగ్గర బ్యాంకు బాలెన్సు లేక పోయినా నీ పరపతి – తిరపతికే కాదు – వైకుంఠానికే వెళ్ళి పోతుంది – ఇంకో విషయం ఆలోచిద్దాం – కొత్త కారులో పెట్రోలు పొయ్యడానికి నెలకు ఎంత లేదన్నా రెండు వేలు ఖర్చు కాదూ !" డప్పారావు ఎక్కడ నొక్కాలో అక్కడ నొక్కుతున్నాడు.

" ఆ ! ఇంకా ఎక్కువే రావొచ్చేమో ! తిరిగేదాన్ని బట్టి !"

" ఇంట్లో కారుంటే తిప్పకుండా ఊరుకుంటారా! మాచెల్లెమ్మ ఊరుకోనిస్తుందా? అయినా కారు కొనేది షికారుకు షి తో పోవడానికేగా – నికార్సుగా యింట్లో పార్కు

చేయడానికి కాదుగా!"

" అయితే ఏంటట!" విసుగొచ్చి అడిగాడు.

" పాత కారుకొని - మిగిలిన ఆ కొత్తకారు డబ్బును వడ్డీలకు తిప్పావే అనుకో - నెలకు మూడు నాలుగు వేలు వస్తుంది - ఆఖరికి నాలాంటి తల మాసిన వెధవకు రూపాయి వడ్డీకిచ్చినా !" రామబాణం వదిలాడు.

సుబ్బారావు ఆ కారులాజిక్కుకు గిలగిల కొట్టుకున్నాడు.

డబ్బారావుకు ఇన్ని తెలివితేటలున్నాయని అప్పుడే తెల్సివచ్చింది - ఊరికే డబ్బాలో గుళకరాళ్ళు వేసినట్లు వాగడమే వచ్చనుకున్నాడు - కాని ఇంత ఇదిగా ఆలోచించగలడని ఎప్పుడూ కలగనలేదు.

" అందరూ మనలా కొంటే - ఇంక కొత్తకారు ఎవరు కొంటారు?" సుబ్బారావుకు అనుమానం పొడసూపింది.

" అందరికీ నాలాంటి సలహాలిచ్చే జీనియస్సులుండరుగా !" అంటూ అతని అనుమానాన్ని నివృత్తి చేశాడు డబ్బారావు.

సుబ్బారావు అలా కనిపిస్తాడు కాని అతనికి కొన్ని మొగబుద్ధులున్నాయి - వాటిల్లో ఒకటి ఫైనాన్షియల్ విషయాల్లో పెళ్ళాంను అస్సలు సలహా అడగకూడదని - సంపాదించేవాడు మొగాడు అయినప్పుడు దాన్ని ఎందుకు అడగాలి?

అందుకని రెండు రోజుల్లో డబ్బారావుకు తెల్సిన బ్రోకరు ద్వారా ఓ సెకండు హ్యాండు కారును ముప్ఫయి వేలకు కొనేశాడు. ఆ ఓనరు తెచ్చి కారును ఇంటి ముందు పార్కు చేసేశాడు. ఎంచగ్గా వెళ్ళి పోయాడు కీ కారులో వదిలేసి.

" ఏమండోయ్ ! అలా బెల్లంకొట్టిన రాయిలా అలా చూస్తూ నిలబడతారేం - వాడెవడో కారును మనింటి ముందు పార్కు చేసి ఎటో వెళుతున్నాడు - మనకు అడ్డం కదూ - యింకెక్కడన్నా పెట్టుకోమనండి." గయ్మని లేచింది అప్పలమ్మ - భర్త చేతకాని తనం మీద ఆమెకు అపారమైన నమ్మకం ఉంది. ఆమె అభిప్రాయం ప్రకారం అతను నోట్లో వేలెట్టినా కొరకలేదు - తను కాబట్టి సర్దుకు పోయి సంసారాన్ని లాగిస్తున్నది.

కృష్ణ పరమాత్మ లాగా చిద్విలాసంగా నవ్వాడు సుబ్బారావు.

అప్పలమ్మకు ఆ నవ్వు వెటకారం కాగా – గొడ్డుకారం పూసినట్లయింది.

"అయ్యో! నేనేమన్నా అంటే లోకులు గయ్యాలి అని అంటారు – చెట్టంత మొగాడివి నువ్వు జెండా బొంగులా నిలబడుండగా – పరాయి మొగాళ్ల మీద ఏమని లేవను?" అంటూ గయ్‌మని అతని మీదకి లేచింది.

"అది కాదే తిక్కదానా! ఆ కారు మనదేనే! ఇవ్వాళ ముహూర్తం బాగుందని ఇక్కడ పెట్టేసి వెళ్ళి పోయాడు." నవ్వుతూ చెప్పాడు.

"ఇంకో సారి చెప్పండి – కారు దానం తీసుకున్నారా – ఇనుము కదండి – శని చుట్టుకుంటుందంటారు – అసలే శనివారం కూడ ఇవ్వాళ" అతడి పిసినారి తనానికి వాపోయింది అప్పలమ్మ.

"అది కాదే! ముప్పయివేలు పెట్టి ఆ కారు నే కొన్నానే!" అంటూ ఏదో చెప్పబోతున్నాడు సుబ్బారావు – కారు వైపు చూస్తూ.

ఇంతలో 'ధమ్' అని శబ్దం వస్తే తల వెనక్కి తిప్పి చూశాడు – అప్పలమ్మ చాప చుట్టలా కింద పడి పోయింది.

"ఒసే – బాల్చీ తన్నేస్తావా ఏమిటి?" అంటూ కంగారుగా లోపలికి పోయి ఓ బిందెతో నీళ్ళు తెచ్చి ఆమెపైన గుమ్మరించాడు.

చీరంతా తడిసి పోయి – జుత్తు తడిసి పోయి – ఇల్లు తడిసి పోయి – ఆమె లేచి కూర్చుంది – 'హాచ్' అని గట్టిగా తుమ్మింది – ఆ అదురుకు సుబ్బారావు పడబోయి నిలదొక్కుకున్నాడు.

"ఏంటండీ! మీరనేది – మీరు కారు కొన్నారా! ఇస్కూటర్‌లో పెట్రోలు ఎవడు పోస్తాడని రోజూ ఎదురు చూసే రకం. అలాంటిది కారులో పెట్రోలు ఎవరు పోస్తారండి దేవుడోయ్!" దీర్ఘం తీసింది.

"నీ మొహం! ఎవరూ పోయని రోజు మనమే పోసుకుంటాం – కారుంటే ఆ గౌరవమే వేరనుకో – వంద యిచ్చేవాడు మూడొందలు యిచ్చి పోతాడు." తన దురాలోచన – దూరాలోచన చెప్పాడు.

కాసేపటికి స్థిమిత పడి కారును పరిశీలించింది అప్పలమ్మ.

" బాగుందా ?" పొంగి పోతూ అడిగాడు సుబ్బారావు.

" ఛూ ! ఉమ్మేసింది - " ఇది ఏం కారండీ ! పెయింటింగు సరిగ్గా లేదు - సీట్లు చిరిగి పోయి ఉన్నాయి - టైర్లు అరిగిపోయినట్లున్నాయి - ఛస్తే ఈ కారు నే ఎక్కను - మీకు సిగ్గు లేక పోయినా - ఫలానా సుబ్బారావు పెళ్ళాంగా నాకు సిగ్గుండాలి కారు ఎక్కడానికి ! ఇది కారు కాదు బేకారు!" అప్పలమ్మ తన అమూల్యమైన అభిప్రాయం వెలిబుచ్చింది.

దాంతో సుబ్బారావుకు ఎక్కడలేని నీరసం ముంచుకొచ్చింది.

" నీకోసమే కదే ఈ కారు కొంది. నా పక్కన నిన్ను కూచో బెట్టుకుని ఊరంతా కారులో షికారు చేద్దామని గదా స్టయిలుగా ఇప్పుడు నువు కూర్చోనంటే నా పక్కన ఎవర్ని కూర్చో బెట్టుకు తిరగాలి? అయినా ఎవరు ఒప్పుకుంటారు కనుక?" వా పోయాడు సుబ్బారావు.

" అటువంటి పిచ్చి వేషాలు వేస్తావేమో - నేను వెంటనే ఏ నుయ్యో గొయ్యో చూసుకుంటా - నా చావుకు కారణం ఈ సెకండ్ హ్యాండు కారు సుబ్బారావు అని రాసి పెట్టి !" రౌద్రంగా అంది అప్పలమ్మ.

" అప్పి ! ముందొక్కమాట చెప్పొచ్చు కదుటే - " కాళ్ళ బేరానికొచ్చాడు.

" సుబ్బీ ! నాకు ఒక్క ముక్క ముందు చెప్పావా - కారు కొనే ముందు."

" లేదు - నిన్ను సర్‌ప్రైజు చేద్దామని -"

" నాపిండాకూడు - నా బ్రతుక్కు అదొక్కటే తక్కువ!"

" ఇప్పుడేం చావమంటావే ! అప్పీ - ప్లీజ్ !"

" నేను కాలు పెట్టాలంటే - ఇది కొత్తకారులా తయారు చెయ్యి తళ తళ లాడుతూ ఉండాలి .... నా కిష్టమైన పసుపు రంగు కొట్టించాలి!" అంటూ కొన్ని సూచనలు - సలహాలు జారీ చేసింది అప్పలమ్మ.

హోమ్ మినిష్టరు ఆర్డరు కాబట్టి ఆఘమేఘాలమీద డబ్బారావును పట్టుకుని ఓ కుర్రకారు మెకానిక్కుని లటుక్కున దొరకపుచ్చుకుని తనకేం కావాలో సెలవిచ్చాడు.

ఆ కుఱ్రకారు మెకానిక్కు నిక్కుతూ నీలుగుతూ దాన్ని నడిపి చూసి కాగితం మీద ఓ పెద్ద లిస్టు తయారు చేశాడు – " సారూ ! ఓ ముప్పయి వేలు పెడితే ఇది కొత్తకారు బాబు లాగా తయారవుతుంది!"

ఆ మాట వినేసరికి గుడ్లు తేలేశాడు సదరు సుబ్బారావు.

పరిస్థితి గమనించిన డబ్బారావు రంగ ప్రవేశం చేసి బేరంలోకి దింపాడు. ఓ అరగంట బేరం చేసింతర్వాత కుఱ్రకారు మెకానిక్కు చెప్పాడు. " బ్యాటరి కొత్తది కొనద్దులేండి. – రీ కండిషనింగు బ్యాటరి వేస్తాను – డబ్బులు తగ్గుతాయి – అంతా కలిపి పాతిక తక్కువ కాదు...' తేల్చి చెప్పేశాడు.

డబ్బారావు సుబ్బారావుతో ఊ అనిపించి కుఱ్రకారు మెకానిక్కుకు కారు అప్పగించి లాక్కొచ్చాడు సుబ్బారావుని యింటికి.

" చెల్లెమ్మను – దేవేరిలా ఊరంతా తిప్పాలంటే ముందు నీకు డ్రైవింగు రావాలిగా లేక పోతే డ్రైవరును పెట్టుకుంటావా?" డబ్బారావు అడిగాడు.

" డ్రైవర్ ! ఓర్నాయనో ! వాడ్ని పోషించడానికే నాజీతం సరిపోదు." మిత్రుల అనుభవాలు విన్న సుబ్బారావు అదిరిపడ్డాడుఅవి మనసులో గుర్తు చేసుకుంటూ.

" అయితే నువ్వు వెంటనే నాకు తెల్సిన గోవిందా డ్రైవింగు స్కూలులో చేరి కారు నడపడం నేర్చుకో – ఈ లోగా నీ కారు నీ యింటి ముందు కొచ్చేస్తుంది."

ఆ ప్రకారంగా సదరు సుబ్బారావు కొన్ని వేలు పోసి కారు డ్రైవింగు నేర్చుకున్నాడు – సూక్ష్మగ్రాహి కాబట్టి ఓ పదిహేను రోజుల్లో కారులోని మెళకువలు యిట్టే పట్టేశాడు. కట్టింగులు – ఫోజులు అన్నీ నేర్చుకున్నాడు.

తన స్వంత కారు కోసం కుఱ్రకారు మెకానిక్కు చుట్టూ తిరగడం హాబీగా మారిపోయింది కొన్నాళ్ళు...

చివరికి అప్పలమ్మ పూజలు ఫలించి – సుబ్బారావు కలలు ఘనీభవించి కుఱ్రకారు మెకానిక్కు కారును తెచ్చి యింటి ముందు పెట్టాడు.

చెప్పడం మరచిపోయాను – ఈ లోగా సుబ్బారావు కొంత చేతి చమురు వదిలించుకుని ఇంటి ముందు కారు షెడ్డు తయారు చేయించాడు – గౌండాలు

గూండాలుగా – గ్రిల్లు వర్కర్లు థ్రిల్లుతో డబ్బు దోచేశారు.

తన పసుపు రంగు కారును చూడగానే అప్పలమ్మ ఎగిరి గంతేసి – సుబ్బారావును వాటేసుకుంది.

బక్క ప్రాణి సుబ్బారావు దభేలున కింద పడిపోయాడు – అతని మీద ఆమె పడింది.. కాసేపు యమపురి అంచు దాకా టికెట్టు లేకుండా ప్రయాణం చేసి వెనక్కి వచ్చాడు.

వెంటనే హారతి పళ్ళెం – టెంకాయ – నిమ్మకాయలు పట్టుకొచ్చింది. "ఏవండి – కారుకు దిష్టి తీద్దాం – అందరి కళ్ళు దీనిపైనే ఉంటాయి –" అంటూ కారు టైర్ల క్రింద నిమ్మకాయలు పెట్టింది.

టెంకాయను కారు చుట్టూ తిప్పుతూ అలవోకగా రోడ్డు మీద కొట్టింది. ముక్కలుగా కొబ్బరి రోడ్డు మీద పడగా – దాని కోసం కాచుకునున్న పిల్లకాయలు ఏరుకున్నారు...

ఆ తరువాత హారతి యిచ్చింది...

"అప్పీ ! ఎదురు రావే !" అంటూ సుబ్బారావు కారు లైట్లు వెలిగించి బండి స్టార్టు చేశాడు...

ఒక్కసారి ముందుకు ఉరికింది – అప్పలమ్మ పైకి రాబోయింది కారు ఆమె కెవ్వున కేక పెడుతూ తప్పుకుంది – కొంచెంలో ఎదురుగా వున్న పోలుకు కొట్టుకోబోయింది .... సుబ్బారావు బ్రేకులు వేసి ఆపేశాడు.

ఓ రోజు సుబ్బారావు అప్పలమ్మను కారులో ఎక్కించుకుని బయలు దేరబోయాడు. ఎంత ప్రయత్నించినా ఇంజను స్టార్టు కావడం లేదు.

అటుగా స్కూలు పిల్లకాయలు పోతూంటే కారు తొయ్యమని అడిగాడు.

ఓ అయిదారు మంది బలవంతాన కారును తోశారు స్టార్టయింది. విజయగర్వంతో కారును తోలాడు సుబ్బారావు – సినిమాకు తీసుకుపోయాడు.

తీరా వచ్చేప్పుడు యిదే తంతు – వాళ్ళను వీళ్ళను బ్రతిమాలు కొని ... కారు నెట్టించుకుని స్టార్టు చేయించుకున్నాడు....

మళ్ళీ మెకానిక్కు మొహం చూసింది కారు....

అయినా అడపాతడపా స్టార్టింగ్ ట్రబుల్ యిస్తూనే ఉంది.

కొత్త పెళ్ళాం – కొత్త కారు స్టార్టింగ్ ట్రబుల్ యిస్తూనే ఉంటాయి అని సర్ది చెప్పుకున్నాడు...

ఓ రోజు పెళ్ళాంని వెంటేసుకుని ... అలంపురంకు బయలు దేరాడు – ఓ పాతిక కిలోమీటర్లే కదాని....

హైవే మీద కారు తోలడం – ఎదురుగుండా లారీలు – బస్సులు – మీద మీద కొచ్చేస్తున్నాయి.

అప్పలమ్మ ఆనందంతో తేలి పోతూ అతని ఒడిలో వాలి పోతున్నది.. చల్లగాలికి ... అప్పలమ్మ చల్లని మెత్తని చేతి స్పర్శకు స్వర్గంలో తేలి పోతున్నాడు. ఇంతలో ఎదురుగా మోటరు సైకిలు మీద కాలేజి స్టూడెంట్లు బస్సును ఓవర్ టేక్ చేస్తూ ర్యాష్‌గా వచ్చారు మీదకి.

కంగారులో వాళ్ళని తప్పించ బోయి రోడ్డు పక్కనున్న చెట్టుకు కారును గుద్దించాడు.... లక్కీగా పెద్ద గాయాలేమీ తగల్లేదు...

" నామంగళ సూత్రం గట్టిగా ఉంది కాబట్టి బ్రతికి పోయాం –" తేరుకున్న తర్వాత అప్పలమ్మ కళ్ళనీళ్ళతో చెప్పింది.

ఆ కారును అక్కడ్నుంచి తేవడం మెకానిక్కు షెడ్డుకు పంపడం – మళ్ళీ ఓ పది వేలు ఖర్చు పెట్టుకోవడం – అదొక ప్రహసనం అయింది.

ఈ లోగా అప్పలమ్మకు యిరుగు పొరుగు అమ్మలక్కలు ఓ పాత కబురు అందించారు.. ఆ కారురు అమ్మిన ఆనందరావుకు ఆ కారు అచ్చిరాలేదట – ఓ సారి భయంకరమైన యాక్సిడెంటులో చావు తప్పి కన్ను లొట్ట బోయిందట – పైగా అడపాతడపా రిపేర్లతోటి నానా తిప్పలు పెట్టిందట – అందుకే అతను కారు చౌకగా దాన్ని వదిలించుకున్నాడట!

రిపేరయి వచ్చింతర్వాత సుబ్బారావు హుషారుగా పిల్చాడు పెళ్ళారని ...

" ఏమేవ్ ! కారు రెడీ – నేను రెడీ ! అహోబిలం పోయి వద్దామా !"

" నే ఛస్తే ఆ కారు ఎక్కను - బ్రతికుంటే బలుసాకు తిని బ్రతకవచ్చు - దాన్ని వెంటనే అమ్మేసెయ్యండి - అది అచ్చిరాని కారట !" అంటూ తను సేకరించిన విషయాలన్నీ పూసగుచ్చినట్లు చెప్పింది.

ఇంక సుబ్బారావు దాన్ని అమ్మకానికి పెట్టాడు... తిరిగాడు మెకానిక్కు చుట్టూ - బ్రోకర్ల చుట్టూ, కొన్న ఖరీదు రిపేర్లు కలిపి ఎనభైవేలయితే అది పాతిక వేలకు అమ్ముడు పోయింది!

సుబ్బారావు గుండెలు బాదుకుంటే అప్పలమ్మ మటుకు ప్రాణాలు మిగిలినందుకు సంతోషించింది.

( ఆంధ్రభూమి సచిత్ర మాస పత్రిక నవంబర్ 2005)